యూరో కింగ్ స్పెయిన్

ఫైనల్‌లో ఇంగ్లండ్‌కు తప్పని నిరాశ • యమాల్‌కు 'యంగ్ ప్లేయర్ అవార్డు' • ఒయర్జాబల్ సూపర్ గోల్

నెల రోజులుగా ఫుట్‌బాల్ అభిమానులను అమితంగా అలరించిన యూరో చాంపియన్‌షిప్ టైటిల్‌ను స్పెయిన్ సొంతం చేసుకుంది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి జరిగిన మ్యాచ్‌లో స్పెయిన్ 2-1తో ఇంగ్లండ్‌ను చిత్తుచేసి పుష్కర కాలం తర్వాత ఈ ట్రోఫీని సగర్వంగా ముద్దాడింది. ఆట తొలి అర్ధభాగంలో గోల్స్ కోసం ఇరుజట్లూ హోరాహోరి తలపడి ఒక్కగోల్ చేయకున్నా మ్యాచ్ కొద్దిసేపట్లో ముగుస్తుందనగా ఒయర్జాబల్ చేసిన గోల్‌తో స్పెయిన్ సంచలన విజయం సాధించింది. సాకర్‌కు పుట్టినిల్లు అయిన ఇంగ్లండ్‌కు మరోసారి నిరాశ తప్పలేదు.

బెర్లిన్: ప్రతిష్టాత్మక యూరో చాంపియన్‌షిప్ టైటిల్‌ను స్పెయిన్ గెలుచుకుంది. జర్మనీ వేదికగా నెలరోజులుగా జరిగిన ఈ మెగా టోర్నీ ఫైనల్‌లో స్పెయిన్ 2-1తో ఇంగ్లండ్‌ను మట్టికరిపించింది. టోర్నీలో ఓటమన్నదే లేకుండా ఫైనల్ చేరిన స్పెయిన్.. తుదిపోరులోనూ చాంపియన్ ఆటతీరుతో ఇంగ్లండ్‌కు మరోసారి రిక్తహస్తమే మిగిల్చింది. ఆట తొలి అర్ధ భాగంలో గోల్స్ కోసం ఇరుజట్లూ హోరాహోరిగా పోరాడినా ఒక్క గోల్ కూడా చేయలేకపోయాయి. కానీ రెండో అర్ధభాగంలో స్పెయిన్ తరపున 47వ నిమిషంలో నికో విలియమ్స్ తొలి గోల్ కొట్టి ఆ జట్టును ఆధిక్యంలోకి తెచ్చాడు. ఇంగ్లండ్ రక్షణ శ్రేణిని చాకచక్యంగా దాటుకుంటూ యువ సంచలనం లమినె యమాల్ అందించిన బంతిని విలియమ్స్ గోల్ పోస్ట్‌లోకి నెట్టాడు. ఇంగ్లండ్ సబ్‌స్టిట్యూట్ ఆటగాడు కొలె పల్మర్ 73వ నిమిషంలో గోల్ చేసి స్కోర్లను సమం చేయడమే గాక ఆ జట్టును పోటీలోకి తెచ్చాడు.

మ్యాచ్ విన్నర్ ఒయర్జాబల్..

ఆట ముగింపు దశకు చేరుకుంటున్న వేళ స్పెయిన్ బ్యాకప్ స్ట్రైకర్ మైకెల్ ఒయర్జాబల్ అద్భుతం చేశాడు. ఆ జట్టు సారథి అల్వారొ మొరట స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ఒయర్జాబల్.. 86వ నిమిషంలో మెరుపు వేగంతో గోల్ సాధించి స్పెయిన్‌ను 2-1 ఆధిక్యంలోకి తెచ్చాడు. ఇక ఆ తర్వాత ఆట నిర్దేశిత సమయంతో పాటు ఎక్స్‌ట్రా టైమ్ (4 నిమిషాలు) లోనూ గోల్ చేయడంలో ఇంగ్లండ్ విఫలమవడంతో యూరో కింగ్స్‌గా స్పెయిన్ అవతరించింది. 1964, 2008, 2012 తర్వాత ఆ జట్టుకు ఇది నాలుగో యూరో చాంపియన్‌షిప్. ఇక 1966లో వరల్డ్ కప్ నెగ్గిన తర్వాత ఇంతవరకూ మేజర్ టైటిల్ నెగ్గని ఇంగ్లండ్ వరుసగా రెండోసారి యూరో ఫైనల్‌లో ఓడి నిరాశగా వెనుదిరిగింది. ఆరు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతారని ఆ జట్టు అభిమానులు భావించినా సాకర్ పుట్టినిల్లు దేశానికి నిరాశే మిగిలింది.

1 ఈ టోర్నీలో ఓటమన్నదే లేకుండా స్పెయిన్ ఏకంగా 15 గోల్స్ చేసింది. 1984లో ఫ్రాన్స్ 14 గోల్స్ చేసిన రికార్డు కనుమరుగైంది.

4 యూరోలో స్పెయిన్ టైటిల్స్. జర్మనీ (3) రికార్డును ఆ జట్టు బ్రేక్ చేసింది.

యమాల్ కేక..

ఆదివారమే 17వ పుట్టినరోజు జరుపుకున్న స్పెయిన్ కుర్రాడు లమినె యమాల్ అతిపిన్న వయసులో ఈ టోర్నీ నెగ్గిన ఆటగాడిగా రికార్డుల కెక్కాడు. అర్జెంటీనా దిగ్గజం లియోనల్ మెస్సీని ఆరాధించే అతడు సెమీస్‌లో ఫ్రాన్స్‌పై గోల్ కొట్టి లైమ్‌లైట్‌లోకి వచ్చాడు. స్పెయిన్ ఫైనల్ చేరడంలో కీలకపాత్ర పోషించిన లమినె.. ఫైనల్‌లో తొలి గోల్ కొట్టిన విలియమ్స్‌కు బంతిని పాస్ చేశాడు. ఇంగ్లండ్ ఆట గాళ్ల నుంచి బంతిని తప్పించుకుంటూ వాళ్లను ఏమార్చాడు.టోర్నీ ఆసాంతం అదరగొట్టిన లమినెకు 'బెస్ట్ యంగ్ ప్లేయర్' అవార్డు దక్కింది.

కాంగ్ యాట్సేపై యశ్వంత్

లేహ్: లఢక్ రీజియన్‌లో ఉన్న కాంగ్ యాట్సే (6,250 మీటర్ల ఎత్తు) పర్వతాన్ని తెలంగాణ గిరిజన కుర్రాడు భూక్యా యశ్వంత్ విజయవంతంగా అధిరోహించాడు. మహబూబాబాద్‌లోని మరిపెడ బంగ్లా మండలం భూక్య తండాకు చెందిన యశ్వంత్.. 8 రోజుల్లో ఈ సాహసయాత్రను పూర్తిచేశాడు. అత్యంత కఠిన సవాళ్లతో కూడిన ఈ యాత్రను పూర్తిచేసిన యశ్వంత్.. ఎవరెస్ట్‌ను అధిరోహించడం తన లక్ష్యమని తెలిపాడు.

'అనుమతివ్వడం లేదని రాసివ్వగలరా?'

కరాచీ: పాకిస్థాన్‌లో వచ్చే ఏడాది జరుగనున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు తమ దేశానికి రావడానికి నిరాకరిస్తున్న భారత క్రికెట్ జట్టు అందుకు గల కారణాలను రాతపూర్వకంగా ఐసీసీకి అందజేయాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కోరనున్నట్టు తెలుస్తోంది. 'భారత ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తే దానికి సంబంధించిన రాతపూర్వక లేఖను బీసీసీఐ.. ఐసీసీకి అందజేయాలి. టోర్నీ ప్రారంభానికి 5-6 నెలల ముందు భారత జట్టు పాక్ పర్యటనకు సంబంధించిన వివరాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలి. దీని కోసం మేం గట్టిగా పట్టుబడతాం' అని పీసీబీ వర్గాలు తెలిపాయి.

సాత్విక్ ద్వయానికి సులువైన డ్రా

పారిస్: ఒలింపిక్స్‌లో భారత బ్యాడ్మింటన్ డబుల్స్ ఆటగాళ్లు సాత్విక్-చిరాగ్ జోడీకి సులువైన డ్రా ఎదురైంది. గ్రూప్-సీలో మూడో సీడ్‌గా బరిలోకి దిగబోతున్న భారత స్టార్ ద్వయం.. ఫజల్ అల్ఫియన్-మహ్మద్ రియాన్ (ఇండోనేషియా), 31వ ర్యాంకు జర్మన్ జోడీ మార్క్ లమ్స్‌ఫస్-మర్విన్ సీడెల్, 43వ ర్యాంకు ఫ్రెంచ్ షట్లర్లు లుకాస్ కొర్వి-రొనాన్ లబర్‌తో పోటీపడనున్నారు.

అర్జెంటీనాదే కోపా అమెరికా

కొలంబియాపై ఉత్కంఠ గెలుపు • 16వ సారి టైటిల్ కైవసం

మియామి: అమెరికా వేదికగా జరిగిన 'కోపా అమెరికా' టైటిల్‌ను డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా నిలబెట్టుకుంది. ఇక్కడి హార్డ్‌రాక్ స్టేడియం వేదికగా జరిగిన తుదిపోరులో అర్జెంటీనా 1-0తో కొలంబియాను ఓడించింది. 112వ నిమిషంలో ఆ జట్టు ఆటగాడు లాటరొ మార్టినెజ్ చేసిన గోల్‌తో అర్జెంటీనా ఈ టోర్నీ చరిత్రలో ఏకంగా 16వ టైటిల్‌ను సొంతం చేసుకుంది. తన కెరీర్‌లో చివరి కోపా అమెరికా మ్యాచ్ ఆడిన అర్జెంటీనా సారథి లియోనల్ మెస్సీ ఈ మ్యాచ్ సగంలోనే గాయం కారణంగా మైదానాన్ని వీడినా ఆ జట్టు అద్భుత పోరాటపటిమతో కొలంబియాను చిత్తుచేసింది. 23 ఏండ్ల తర్వాత ఫైనల్ చేరిన కొలంబియా.. విజయం కోసం ఆఖరి నిమిషం దాకా శ్రమించినా ఆ జట్టుకు పరాభవం తప్పలేదు. ఆ జట్టు ఆటగాడు జేమ్స్ రోడ్రిగ్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు దక్కింది.

ఫైనల్ పోరుకు ముందు టికెట్లు లేకుండా మైదానంలోకి వచ్చిన అభిమానులు అరాచకం సృష్టించడంతో గంటా 22 నిమిషాల పాటు ఆలస్యంగా మొదలైన ఈ మ్యాచ్‌లో గోల్స్ కోసం రెండు జట్లూ నువ్వానేనా అన్నట్టుగా తలపడ్డాయి. అర్జెంటీనా స్టార్ ఆటగాడు మెస్సీ 64వ నిమిషంలో మైదానాన్ని వీడాడు. మ్యాచ్ నిర్దేశిత సమయంలో ఇరుజట్లూ ఒక్క గోల్ చేయకపోవడంతో ఫలితం కోసం అదనపు సమయాన్ని కేటాయించగా మ్యాచ్ ఇక ముగుస్తుందనగా మార్టినెజ్ గోల్ కొట్టి అర్జెంటీనాకు విజయాన్ని అందించాడు. ఈ టోర్నీలో అతడినే 'గోల్డెన్ బూట్' అవార్డు వరించింది. 2021లో కోపా అమెరికా టైటిల్ నెగ్గిన అర్జెంటీనా.. 2022లో ఫిఫా వరల్డ్ కప్‌తో పాటు తాజాగా ఈ టోర్నీలో గెలిచి ఫుట్‌బాల్ చరిత్రలో స్పెయిన్ తర్వాత వరుసగా మూడు మేజర్ టోర్నీలు గెలిచిన రెండో జట్టుగా రికార్డులకెక్కింది. స్పెయిన్ 2008, 2012లో యూరో కప్ నెగ్గగా 2010లో వరల్డ్ కప్ గెలిచింది.

15వ మాన్‌సూన్ రెగట్టా పోటీలు షురూ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నగరంలోని హుసేన్‌సాగర్ వేదికగా 15వ మాన్‌సూన్ రెగట్టా పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు వేగంగా వీస్తున్న గాలులు సాగర్‌లో సెయిలర్లకు కఠిన సవాల్ విసిరాయి. తొలి రోజు పలు విభాగాలలో పోటీ పడ్డ సెయిలర్లు వర్షంలోనూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్-16 ఆప్టిమిస్ట్ క్లాస్‌లో తమిళనాడు సెయిలర్ శ్రేయా కృష్ణ ఓ రేసులో గెలిచి మరో రేసులో రెండో స్థానం సాధించింది. తెలంగాణ అబ్బాయి పల్లారా గోవర్ధన్ ఓ విజయం, మరో రేసులో రెండో స్థానంతో ఆమెకు గట్టి పోటీనిచ్చాడు.టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన తెలంగాణ అమ్మాయి దీక్షిత ఒక రేసులో మూడో స్థానం దక్కించుకోగా మరో రేసులో 11వ స్థానంతో తీవ్ర నిరాశపరిచింది.

పాక్‌లో యంగ్ బుమ్రా

ఢిల్లీ: పాకిస్థాన్‌కు చెందిన ఓ పిల్లాడు టీమ్‌ఇండియా ఏస్ పేసర్ జస్‌ప్రిత్ బుమ్రా బౌలింగ్ శైలిని అచ్చుగుద్దినట్టు అనుకరిస్తున్నాడు. సుమారు 10-12 ఏండ్ల వయసుండే ఈ చిన్నోడు.. బుమ్రా రనప్, బంతిని సంధించే విధానం, బాల్ డెలివరీ అయ్యాక అతడి హావభావాలను పొల్లుబోకుండా అనుకరిస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎత్తైన కొండల మధ్య ఉన్న ఓ ప్రదేశంలో గల్లీ క్రికెట్ ఆడుతున్న అతడి బౌలింగ్ శైలిని చూసి నెటిజన్లు 'పాక్‌లో జూనియర్ బుమ్రా' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. 'ఎక్స్'లో 'యంగ్ బుమ్రా ఫ్రమ్ పాకిస్థాన్' అని సెర్చ్ చేస్తే అందుకు సంబంధించిన వీడియో ప్లే అవుతుంది.

మమ్మల్ని క్షమించండి

అభ్యంతరకర వీడియోపై స్పందించిన భజ్జీ

ఢిల్లీ: భారత మాజీ క్రికెటర్లు హర్భజన్ సింగ్, యువరాజ్ సింగ్, సురేశ్ రైనా చిక్కుల్లో పడ్డారు. మూడు రోజుల క్రితం ఎడ్జ్‌బాస్టన్ (ఇంగ్లండ్) వేదికగా ముగిసిన వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్‌లో పాకిస్థాన్‌ను ఓడించి టైటిల్ నెగ్గిన తర్వాత ఈ ముగ్గురూ బాలీవుడ్ పాట 'తౌబా తౌబా'కు స్టెప్పులేసిన రీల్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడమే ఇందుకు కారణం. వీడియోలో ఈ ముగ్గురూ నడుము పట్టుకుని కుంటుకుంటూ చేసిన డాన్స్ వివాదాస్పదమైంది. ఈ వీడియోపై పారా అథ్లెట్ మానసి జోషి 'దివ్యాంగులంటే మీకు అంత చులకనా?' అని ఎక్స్‌లో మండిపడింది. పలు హక్కుల కార్యకర్తల సంఘాలు సైతం క్రికెటర్ల తీరును తప్పబట్టడంతో భజ్జీ నష్ట నివారణ చర్యలకు దిగాడు. 15 రోజుల పాటు క్రికెట్ ఆడాక తాము అలిసిపోయామని తెలియచెప్పడానికే అలా చేశామని అంతే తప్ప ఎవరినీ బాధపెట్టడానికి కాదంటూ వివరణ ఇచ్చుకున్నాడు.

చిత్రం

'బలగం' చూసి ప్రియదర్శి ఫ్యాన్ అయిపోయా!

ప్రియదర్శి, నభా నటేష్ జంటగా నటిస్తున్న చిత్రం 'డార్లింగ్'. అశ్విన్ కె రామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హీరో నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమా ట్రైలర్ చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంది. ఈ మధ్య యాక్షన్ సినిమాలు ఎక్కువై పోయి లవ్‌స్టోరీస్ మిస్ అవుతున్నాం. ఆ లోటును ఈ సినిమా తీరుస్తుంది. ఈ సినిమా కాన్సెప్ట్ అదిరిపోయింది. ఈ కథ వినగానే కామెడీ ఏ స్థాయిలో ఉంటుందో అర్థమైంది. ప్రియదర్శి నాకు ఎంతో ఇష్టమైన వ్యక్తి. 'హాయ్ నాన్న' షూటింగ్ టైమ్‌లో గోవాలో నాకు అద్భుతమైన కంపెనీ ఇచ్చాడు. అతని నటన, ఎంచుకునే పాత్రలు చాలా బాగుంటాయి. ప్రియదర్శి అమాయకత్వంలో మంచి అల్లరి ఉంటుంది. 'బలగం' సినిమా చూసి ఆయన ఫ్యాన్ అయిపోయా. నా సొంత నిర్మాణ సంస్థలో ప్రియదర్శితో ఓ సినిమా చేయబోతున్నా' అన్నారు. ప్రియదర్శి మాట్లాడుతూ 'ఈ జనరేషన్ హీరోల్లో నేను నానిని స్ఫూర్తిగా తీసుకుంటా. ప్రతిభ ఉంటే ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకున్నా ఇండస్ట్రీలో రాణించవొచ్చని ఆయన నిరూపించారు. 'డార్లింగ్' అద్భుతమైన కథ. ఇందులోని కొత్తదనం బాగా నచ్చింది' అన్నారు. 'ఇది నాకు సినిమా కాదు. ఒక ఎమోషన్. చాలా టఫ్ టైమ్‌లో ఉన్నప్పుడు ఈ అవకాశం వచ్చింది. డ్రీమ్‌రోల్ చేశాననే సంతృప్తి మిగిలింది' అని నభా నటేష్ చెప్పింది. టీమ్ అందరి సహకారంతో సినిమా అద్భుతంగా వచ్చిందని నిర్మాత చైతన్య రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

తమిళ దర్శకుడితో?

'పుష్ప 2' తర్వాత బన్నీ ఎవరితో చేస్తారు? అనే విషయంపై రకరకాల పేర్లు కొన్ని నెలలుగా వినిపిస్తూనే ఉన్నాయి. మొదట్లో త్రివిక్రమ్ పేరు బాగా వినపడింది. ఆ తర్వాత అట్లీ పేరు. ఇప్పుడు నెల్సన్ పేరు వీరిద్దరికంటే ఎక్కువగా వినిపిస్తున్నది. 'జైలర్' సినిమాతో అఖండ విజయాన్ని అందుకున్నారు నెల్సన్. ఆరు నెలల క్రితమే అల్లు అర్జున్‌కి నెల్సన్ కథ వినిపించారట. కథ నచ్చడంతో బన్నీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ఫిల్మ్‌నగర్ టాక్. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌లో నెల్సన్ బిజీగా ఉన్నట్టు సమాచారం. యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్ సమపాళ్లలో ఉండే కథాంశంతో తెరకెక్కనున్న ఈ సినిమాను పాన్‌ఇండియా స్థాయిలో నిర్మించనున్నారట 'రేసుగుర్రం' నిర్మాత నల్లమలపు బుజ్జి. 'పుష్ప 2' తర్వాత బన్నీ చేసే సినిమా ఇదేనని ఫిల్మ్ వర్గాల వినికిడి. ఇందులో నిజానిజాలు తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

వచ్చే నెల నుంచే హడావిడి

మహేశ్‌బాబు, రాజమౌళి సినిమాకు సంబంధించిన అధికార ప్రకటన కోసం ఆడియన్స్ ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఆగస్ట్ 9న మహేశ్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన తొలి ప్రెస్‌మీట్‌ను మేకర్స్ నిర్వహించనున్నారట. ఆ రోజునే మూవీ కాన్సెప్ట్ వీడియోను కూడా విడుదల చేయనున్నట్టు గతంలో వార్తలొచ్చాయి. ఇప్పుడు ఈ సినిమాకు చెందిన మరో తాజా వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో బలంగా వినిపిస్తున్నది. ఈ సినిమాను రాజమౌళి మూడు భాగాలుగా తీయనున్నారట. తొలి భాగంలో మహేశ్ కథానాయకుడు కాగా, మిగతా రెండు భాగాల్లో మహేశ్‌తోపాటు మరో ఇద్దరు స్టార్ హీరోలు కూడా యాడ్ అవుతారట. ఇందులో నిజానిజాలు తెలియాల్సివుంది. ఇదిలా వుంటే.. ఈ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ నెట్స్ మంత్ మొదలుకానున్నాయి. మరోవైపు మిగతా నటీనటుల ఎంపిక కోసం టెస్ట్ షూట్ కూడా జరుగుతున్నది. ఇంకోవైపు మహేశ్‌బాబుకు సంబంధించిన టెస్ట్ షూట్ కూడా కానిచ్చేస్తున్నారట. సెప్టెంబర్ నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలుకానున్నదని, ఇందులో భాగంగానే హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో భారీ సెట్ల నిర్మాణం కూడా జరుగుతున్నదని తెలుస్తున్నది.

నాథనాథుడి ఉగ్రరూపం

మంచు విష్ణు టైటిల్ రోల్‌ని పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో మోహన్‌లాల్, మోహన్‌బాబు, అక్షయ్‌కుమార్, ప్రభాస్, శరత్‌కుమార్ వంటి అగ్ర నటులు భాగమైన విషయం తెలిసిందే. మహాశివభక్తుడు కన్నప్ప ఇతివృత్తంతో రూపొందిస్తున్న ఈ సినిమాలో శరత్‌కుమార్ నాథనాథుడి పాత్రలో కనిపించనున్నారు. ఆదివారం ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన భారీ ఖడ్గాన్ని చేతబూని ఉగ్రరూపంలో కనిపిస్తున్నారు. కథానుగుణంగా ఆయన పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని, ఓ యోధుడిగా ఆయన నటన ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నారు. డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది.

సల్మాన్‌ఖాన్ 'ది బుల్'

తమిళ దర్శకుడు అట్లీ డైరెక్ట్ చేసిన 'జవాన్' బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడంతో ఇప్పుడు బాలీవుడ్ అగ్ర హీరోలు తమిళ దర్శకులతో సినిమాలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. అగ్ర హీరో సల్మాన్‌ఖాన్ అయితే వరుసగా ముగ్గురు తమిళ డైరెక్టర్స్‌ను లైన్‌లో ఉంచారు. ప్రస్తుతం ఆయన 'సికిందర్' చిత్రంలో నటిస్తున్నారు. మురుగదాస్ దర్శకుడు. దీని తర్వాత అట్లీ దర్శకత్వంలో సల్మాన్‌ఖాన్ ఓ సినిమా చేయబోతున్నారని తెలిసింది.

తాజా సమాచారం ప్రకారం సల్మాన్‌ఖాన్ మరో తమిళ దర్శకుడు విష్ణువర్ధన్‌కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. ఈ చిత్రానికి 'ది బుల్' అనే టైటిల్‌ను ఖరారు చేశారని సమాచారం. పూర్తిగా స్పెయిన్‌లో చిత్రీకరించబోతున్న ఈ సినిమాలో త్రిష కథానాయికగా నటించనుందని చెబుతున్నారు. ఈ సంవత్సరాంతంలో షూటింగ్ మొదలుపెట్టనున్నారని తమిళ ఫిల్మ్ వర్గాల సమాచారం.

ఒళ్లు దగ్గరపెట్టుకొని సినిమాలు చేస్తా

'ఎస్ఆర్ కళ్యాణమండపం, రాజావారు రాణీవారు బాగా ఆడాయి. ఆ తర్వాత సైన్ చేసిన సినిమాలు అనుకున్న స్థాయిలో ఆడలేదు. కథను బట్టి సీన్స్ ఉంటాయి. సీన్స్ బలంగా ఉంటే నటించే అవకాశం ఉంటుంది. ఇది ప్రతిఒక్కరూ గ్రహించాలి. 'వీడి పని అయిపోయింది..' అని ఎవరైనా అంటే నమ్మకండి. మన పని అయిపోయిందా లేదా అనేది మనకే తెలుస్తుంది. నిజంగా నా పని అయిపోయిందని అనిపిస్తే సినిమాలు చేయను. ఇక నుంచి ఒళ్లు దగ్గర పెట్టుకొని సినిమాలు చేస్తా. 'క' కచ్చితంగా అందరూ మెచ్చే సినిమా అవుతుంది'. అని యువహీరో కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన హీరోగా రూపొందుతోన్న పీరియాడిక్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీరామ్ కథానాయికలు. సుజీత్, సందీప్ కలిసి దర్శకత్వం వహిస్తున్నారు. చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మాత. త్వరలో పాన్‌ఇండియా స్థాయిలో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిరణ్ మాట్లాడారు. ఇదొక పల్లెటూరి నేపథ్యంలోసాగే యాక్షన్ థ్రిల్లర్ అని, అవకాశం ఇచ్చిన నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి, హీరో కిరణ్ అబ్బవరంకు కృతజ్ఞతలని దర్శకులు చెప్పారు.

అల్ఫా కోసం సన్నద్ధం

బాలీవుడ్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ మొదలుపెట్టి కథానాయికగా రాణిస్తున్నది శార్వరి వాఘ్. 'బంటీ ఔర్ బబ్లీ 2' చిత్రం ఆమెకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది. ప్రస్తుతం ఈ భామ యష్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా తెరకెక్కిస్తున్న 'అల్ఫా' చిత్రంలో కీలక పాత్రను పోషించనుంది. యష్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తున్న తొలి లేడీ ఓరియెంటెడ్ స్పై చిత్రమిదే కావడం విశేషం. ఇందులో అలియాభట్ లీడ్ రోల్‌ని పోషిస్తున్నది. ఇప్పటికే ఆమె షూటింగ్‌లో పాల్గొంటున్నది. 'అల్ఫా' చిత్రంలో శార్వరి వాఘ్ పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని, యాక్షన్ ప్రధానంగా ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ సినిమా కోసం శార్వరి వాఘ్ ప్రత్యేకంగా సన్నద్ధమవుతున్నది. ఫిజికల్‌గా మరింత ఫిట్‌గా కనిపించేందుకు కసరత్తులు చేస్తున్నది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్‌మీడియాలో అందరిని ఆకట్టుకుంటున్నాయి. త్వరలో ఆమె 'అల్ఫా' షూటింగ్‌లో పాల్గొనబోతున్నది. ఆదిత్యచోప్రా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

తనకంటే చిన్నవాడితో ప్రేమ?

ప్రమోషన్లకు రాదు, స్టార్ హీరోలను కూడా లెక్కచేయదు అనే అభిప్రాయాలు నయనతారపై చాలామందిలో ఉన్నాయి. కానీ ఆమె మాత్రం కథ నచ్చితే చిన్న హీరోల పక్కన కూడా చేయడానికి వెనుకాడదు. ఇది నయనతారలోని ఇంకో యాంగిల్ అనొచ్చు. రీసెంట్‌గా నయన్ ఓ సినిమా ఒప్పుకుంది. ఈ సినిమాకు హీరో కెవిన్‌రాజ్. తమిళ బిగ్‌బాస్‌తో ఇతను లైమ్‌లైట్‌లోకొచ్చాడు. ఈ సినిమాను నయన్ భర్త విఘ్నేశ్ నిర్మించనున్నాడట. విష్ణు ఇడవన్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కానున్నాడు. ఇందులో నయన్ పాత్ర గురించి ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూస్తున్నాయి. కథ రీత్యా ఇందులో నయన్ హీరోకంటే వయసులో పెద్ద అట. కానీ.. చిన్నవాడైన హీరోను లవ్ చేస్తుందట. ఈ కథ నచ్చే నయన్ చేయడానికి ఒప్పుకుందని తెలుస్తోంది. ఏదేమైనా తాను హీరోగా నటిస్తున్న సినిమాలో నయనతార వంటి సూపర్‌స్టార్ హీరోయిన్ కావడంతో కెవిన్‌రాజ్ ఆనందానికి పట్టపగ్గాల్లేవట.

ముందు బ్యాడ్‌న్యూస్ ఎంజాయ్‌చేయండి

'గుడ్ న్యూస్ నిజమేనా? అనడిగితే.. ముందు 'బ్యాడ్‌న్యూస్' ఎంజాయ్ చేయండి.. అంటున్నారు బాలీవుడ్ స్టార్‌హీరో విక్కీకౌశల్. ఆయన కథానాయకుడిగా, త్రిప్తి డిమ్రీ కథానాయికగా రూపొందిన 'బ్యాడ్‌న్యూస్' సినిమా ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా విరివిగా ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు విక్కీకౌశల్.

తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో కత్రినా ప్రెగ్నెంట్ అనే వార్తపై ఆయన స్పందిస్తూ.. 'నిజంగా అలాంటి గుడ్‌న్యూస్ ఏదైనా ఉంటే, సంతోషంగా మీ అందరితో పంచుకోకుండా ఉంటామా?!.. ఆ వార్తల్లో నిజం లేదు. ప్రస్తుతానికి 'బ్యాడ్ న్యూస్' ఎంజాయ్ చేయండి. సమయం వచ్చినప్పుడు ఆ 'గుడ్‌న్యూస్' ఎంజాయ్ చేద్దురుగానీ..' అంటూ నవ్వుతూ చెప్పారు విక్కీ కౌశల్. ఈ సినిమాలోని 'తౌబా తౌబా' పాట విడుదలై మంచి ఆదరణ పొందుతున్నది. ఈ పాట గురించి మాట్లాడుతూ 'నాకు డ్యాన్స్ రాదు. కానీ మా యూనిట్ నాకు డ్యాన్స్ నేర్పించారు. ఈ పాటకోసం చాలా కష్టపడ్డాం. ప్రేక్షకులు శ్రమకు తగ్గ ఫలితం ఇస్తారనుకుంటున్నా.' అని అన్నారు విక్కీ.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.